

155 వ భాగం

భాగవతం మొదలు, నారదుడు – 1

వ్యాసుడు మనసు బాగోలేదని చింతిస్తున్నప్పుడు నారదుడు వచ్చాడనీ, భాగవతం రాయమని చెప్తూ భగవంతుడి ని భక్తితో గుర్తు పెట్టుకుంటే చాలు మిగతావన్నీ అవే సర్దుకుంటాయనీ చెప్పడం చూశాం. దీనికి ఇంకా వివరణ ఇస్తూ తాను కూడా పడిన కష్టాలన్నీ చెప్తున్నాడు ఇప్పుడు నారదుడు. ఈ చెప్పడం ఎందుకంటే ఇదంతా తాను స్వయానా అనుభవించాడు. ఎక్కడో విని చెప్తున్నది కాదు.

చ. తన కులధర్మమున్ విడిచి దానవవైరి పదారవిందముల్
పనివడి సేవసేసి పరిపాకముఁ బొందక యెవ్వఁడేనిఁ జ
చ్చిన, మఱు మేన నైన నది సిద్ధి వహించుఁ దదీయ సేవఁ బా
సినఁ గుల ధర్మగౌరవము సిద్ధి వహించునె యెన్ని మేనులన్. [1-100]

స్వధర్మం విడిచి శ్రీహరి (దానవ వైరి, రాక్షసులకి శత్రువు) కాళ్ళు పట్టుకున్నాక కూడా పరిపాకం పొందలేనివారు వచ్చే జన్మలో (మరు మేను నైన, లేదా వేరే శరీరం/జన్మలో) తప్పకుండా సిద్ధి పొందుతాడు. అయితే ధర్మం మాత్రం పాటించేవాడు ఎన్నాళ్ళైనా సిద్ధి పొందుతాడా అనేది చెప్పలేం. ఇదే భగవద్గీతలో కృష్ణుడు చెప్పడం కూడా చూస్తాం.

ప్రాప్య పుణ్యకృతాం లోకానుషిత్వా శాశ్వతీః సమాః ।
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే ॥
అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్ ।
ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్ ॥ [భగవద్గీత ధ్యానయోగం6-41, 42]

వ. అదిగావున నెఱుక గలవాఁడు హరిసేవకుం బ్రయత్నంబు సేయం దగుఁ; గాలక్రమంబున సుఖదుఃఖంబులు ప్రాప్తంబు లయినను హరిసేవ విడువం దగదు; దానం జేసి యూర్ధ్వంబున బ్రహ్మ పర్యంతంబు గ్రింద స్థావర పర్యంతంబుఁ దిరుగుచున్న జీవులకు నెయ్యది వొందరా దట్టి మేలు సిద్ధించుకొఱకు హరిసేవ సేయవలయు; హరిసేవకుం డగువాఁడు జననంబు నొందియు నన్యుని క్రియ సంసారంబునం జిక్కండు; క్రమ్మఱ హరిచరణ స్మరణంబుఁ జేయుచు భక్తి రసవశీకృతుం డయి విడువ నిచ్చగింపఁడు; మఱియును.

[1-101]

ఈ జన్మలో కాకపోతే మరో జన్మలో అయినా తప్పకుండా సిద్ధి పొందుతాడు అని చెప్పాడు కనక మరోసారి చెప్తున్నాడు – వదలకుండా అలా సాధన చేస్తూనే ఉండాలి. అయితే సిద్ధి అనేది పొందాక ఆ ఆనందం ఎటువంటిది? పైన ఉన్న బ్రహ్మలోకంలో ఉండే బ్రహ్మ నుండి, ఈ కింద ఉన్న అనేకానేక జీవరాసులవరకూ ఎవరికీ అంత సులభంగా అందని సంతోషం. హరి సేవకుడు ఒకసారి ఏ జన్మ వచ్చినా సంసారంలో చిక్కుకోడు. రామకృష్ణులు చెప్పినట్టూ ఒకసారి అలా భగవంతుడి సేవలో నిమగ్నమైతే అందులో మునిగి (రసవశీకృతుండయి) బయటకి రాలేడు.

సీ. విష్ణుండు విశ్వంబు, విష్ణునికంటెను
వేఱేమియును లేదు విశ్వమునకు
భవవృద్ధిలయము లా పరమేశుచే నగు
నీ వెఱుంగుదు కాదె నీ ముఖమున
నెఱిఁగింప బడ్డది యేక దేశమున నీ
భువన భద్రమునకై పుట్టినట్టి
హరికళాజాతుండ వని విచారింపుము,
రమణతో హరిపరాక్రమము లెల్ల [1-102]

ఆ. వినుతిసేయు మీవు; వినికియుఁ, జదువును,
దాన, మతుల నయముఁ, దపము, ధృతియుఁ,
గలిమి కెల్ల ఫలముగాదె పుణ్యశ్లోకుఁ
గమలనాభుఁ బొగడఁ గలిగెనేని. [1-102.1]

ఈ సీసంలో చెప్పేది భగవంతుడు సర్వాంతర్యామి అనేది. ఈ విశ్వం అంటే భగవంతుడు (విష్ణుండు విశ్వంబు), ఆయనకంటే వేరే ఏమీ లేదు. ఈ విశ్వానికి బలం వృద్ధీ, క్షయం కలుగుతున్నాయంటే భగవంతుడి మూలానే అని శ్రీహరి అంశ తో పుట్టిన (హరికళాజాతుండవు) నీకు తెలుసు కదా? అందువల్ల వినడం, చదవడం (వినికియుఁ, జదువును), దానం, గొప్పదైన నీతి (అతుల నయము), తపస్సు, ధైర్యం (ధృతియు), సంపద (కలిమి) వీటి అన్నింటికీ ప్రయోజనం భగవంతుణ్ణి కీర్తించడమే.

ఇంతవరకూ చెప్పాక ఇవన్నీ నీకు ఎలా తెలిసాయి అంటాడేమో అని తన స్వంత కథ చెప్తున్నాడు ఇప్పుడు నారదుడు. తాను ఎన్ని కష్టాలు పడితే భగవద్దర్శనం అయిందో.

వ. మహాత్మా! నేను పూర్వకల్పంబునం దొల్లిఁటి జన్మంబున వేదవాదుల యింటిదాసికిం బుట్టి, పిన్ననాఁడు వారలచేఁ బంపంబడి, యొక్క వానకాలంబునఁ జాతుర్మాస్యంబున నేకస్థల నివాసంబు సేయ నిశ్చయించు యోగిజనులకుం బరిచర్య సేయుచు. [1-103]

క. ఓటమితో నెల్లప్పుడుఁ
బాటవమునఁ బనులు సేసి, బాలురతో నే
యాటలకుఁ బోక, యొక జం
జాటంబును లేక, భక్తి సలుపుదు ననఘా! [1-104]

గతజన్మలో నేను వేదవాదుల ఇంట్లో పనిచేసే దాసికి పుత్రుడిని. చిన్నపుడు వీళ్ళకి చాతుర్మాసం లో సేవకి నన్ను ఉపయోగించారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి లేదా తొలి ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి లేదా కార్తీక పూర్ణిమ వరకు ఉండే నాలుగు నెలల కాలం. ఈ సమయంలో శ్రీ మహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్తాడని పురాణాల నమ్మకం. ఈ నాలుగు నెలల కాలంలో ఒకే చోట స్థిరంగా ఉండి అనుష్ఠానం – ఉపవాసం, పూజలూ చేస్తారు. వీళ్ళకి భయభక్తులతో, మిగతా పిల్లలతో ఆటలకి పోకుండా సేవ చేసాను.

క. మంగళమనుచును వారల
యెంగిలి భక్షింతు, వాన కెండకు నోడన్,
ముంగల నిలుతును నియతిని,
వెంగలి క్రియఁ జనుదు నురు వివేకముతోడన్. [1-105]

వ. ఇట్లేను వర్షాకాల శరత్కాలంబులు సేవించితి; వారును నా యందుఁ గృపసేసి రంత. [1-106]

వాళ్ళు తినగా మిగిలినది నేను తిన్నాను. వానకి, ఎండకీ ఓర్చుకుని వాళ్ళు ఏమి అడిగినా చేసిపెట్టేవాడిని. అలా వర్షాకాలం, శరత్కాలం సేవించాక వాళ్ళకి కూడా నా మీద కృప కలిగింది.

శా. వారల్ కృష్ణ చరిత్రముల్ చదువఁగా, వర్ణింపఁగాఁ, బాడఁగా,
నా రావంబు సుధారసప్రతిమమై యశ్రాంతమున్ వీనులం
దోరంబై పరిపూర్ణమైన, మది సంతోషించి నే నంతటం
బ్రారంభించితి విష్ణుసేవ కితరప్రారంభ దూరుండనై [1-107]

వ. ఇట్లు హరిసేవారతిం జేసి ప్రపంచాతీతుండ నై, బ్రహ్మరూపకుండ నయిన నా యందు స్థూలసూక్ష్మం బయిన యీ శరీరంబు నిజ మాయాకల్పితం బని యెఱింగితి; యమ్మహాత్ము లగు యోగిజనుల మూలంబున రజస్తమోగుణ పరిహారిణి యయిన భక్తి సంభవించె; నంతఁ జాతుర్మాస్యంబు నిండిన నయ్యోగిజనులు యాత్ర సేయువార లై; రివ్విధంబున. [1-108]

వాళ్ళు భగవంతుడి చరిత్రలు చదువుతూ ఉంటే నా మనసు ఆనందంతో నిండిపోయేది (మది సంతోషించి). అలా నేను కూడా శ్రీహరిని సేవించడం ప్రారంభించాను. అలా ధ్యానంలో పై మెట్లు ఎక్కగానే (ప్రపంచాతీతుండ నై, బ్రహ్మరూపకుండనై) ఈ శరీరం మాయా కల్పితం అని తెలిసి వచ్చింది. మహాత్ములకి సేవ చేసాను కనక వాళ్ళ వల్ల అనన్యమైన భక్తి (రజస్తమోగుణ పరిహారిణి యయిన భక్తి) కలిగింది భగవంతుడి మీద. ఆ యోగులందరూ కూడా చాతుర్మాస్యం అయ్యాక యాత్రలకి వెళ్ళారు.

మ. అపచారంబులు లేక, నిత్యపరిచర్యాభక్తి యుక్తుండనై,
చపలత్వంబును మాని, నేఁ గొలువఁగా సంప్రీతులై వారు ని
ష్కపటత్వంబున, దీనవత్సలతోఁ, గారుణ్య సంయుక్తులై
యుపదేశించిరి నాకు నీశ్వరరహస్యోదారవిజ్ఞానమున్. [1-109]

అయితే వెళ్ళేముందు మంచి భక్తితో సేవచేసినందుకు సంతోషించి మంచి మనస్సుతో, కరుణతో అతి రహస్యం, అమోఘం అయిన ఈశ్వర విజ్ఞానం ఉపదేశించారు. ఇదే భగవద్గీతలో చెప్పిన జ్ఞాన విజ్ఞనయోగం. అది పట్టుకుని సాధన మొదలుపెట్టాలి.

వ. ఏనును వారి యుపదేశంబున వాసుదేవుని మాయానుభావంబు దెలిసితి; నీశ్వరుని యందు సమర్పితం బయిన కర్మంబు దాపత్రయంబు మానుప నౌషధం బగు; నే ద్రవ్యంబువలన నే రోగంబు జనియించె నా ద్రవ్యం బా రోగంబు మానుప నేరదు; ద్రవ్యాంతరంబులచేత నైన చికిత్స మానుపనోపు; నివ్విధంబునఁ గర్మంబులు సంసార హేతుకంబు లయ్యు నీశ్వరార్పితంబు లై తాము తమ్ముఁ జెఱుపుకొన నోపి యుండు; నీశ్వరుని యందుఁ జేయంబడు కర్మంబు విజ్ఞానహేతుకం బై, యీశ్వర సంతోషణంబును, భక్తియోగంబునుం బుట్టించు; నీశ్వరశిక్షం జేసి కర్మంబులు సేయువారలు కృష్ణ గుణనామ వర్ణనస్మరణంబులు సేయుదురు; ప్రణవపూర్వకంబులుగా వాసుదేవ ప్రద్యుమ్నసంకర్షణానిరుద్ధ మూర్తి నామంబులు నాలుగు భక్తిం బలికి, నమస్కారంబు సేసి, మంత్రమూర్తియు మూర్తిశూన్యుండు నయిన యజ్ఞపురుషుం బూజించు పురుషుండు సమ్యగ్దర్శనుం డగు. [1-110]

వాళ్ళు చెప్పిన ఉపదేశం విన్నాక భగవంతుడి మాయ అనేది తెలిసి వచ్చింది. తాపత్రయం మాన్పేది భగవంతుడికి అర్పించే కర్మ మాత్రమే. కర్మలు భవబంధాలకి కారణమే కానీ వాటిని ఈశ్వరార్పణం చేస్తే వాటివల్ల కర్మ అంటుకోదు (కర్మణ్యే వ్యాధికారస్తే మా ఫలేషు కదాచన.. భగవద్గీత 2-47). ఓంకారంతో పాటు వాసుదేవ, ప్రద్యుమ్న, సంకర్షణ అనిరుద్ధ అనే నాలుగు పేర్లు భక్తితో పలికితే సమదృష్టి కలుగుతుంది.

క. ఏ నవ్విధమునఁ జేయఁగ,
దానవకులవైరి నాకుఁ దనయందలి వి
జ్ఞానము నిచ్చెను, మదను
ష్ఠానము నతఁ డెఱుఁగు, నీవు సలుపుము దీనిన్. [1-111]

క. మునికులములోన మిక్కిలి
వినుకులు గలవాఁడ వీవు, విభుకీర్తులు నీ
వనుదినముఁ బొగడ వినియెడి
జనములకున్ దుఃఖమెల్ల శాంతిం బొందున్. [1-112]

నేను అలా చేయగానే విష్ణువు అనుగ్రహించి తనలో విజ్ఞానం నాకు ఇచ్చాడు. నేను చేసిన అనుష్ఠానం అతనికి తెలుసు. నువ్వు కూడా అలాగే చేయి. మునులలో ప్రసిద్ధుడివి నువ్వు, వినేవారికి ఇష్టం కలిగేలా దుఃఖాలు తగ్గేలా శాంతి పొందేలాగా భగవంతుణ్ణి కీర్తించు.

మ. విను మా భిక్షులు నీకు నిట్లు కరుణన్ విజ్ఞానముం జెప్పి పో
యిన, బాల్యంబున వృద్ధభావమున నీ కే రీతి సంచారముల్
సనె? నీకిప్పుడు పూర్వకల్పమతి యే జాడం బ్రదీపించెఁ? ద
త్తనువుం బాసిన చందమెట్లు? చెపుమా దాసీసుతత్వంబుతోన్. [1-114]

వ్యాసుడు ఇదంతా విన్నాక అడుగుతున్నాడు. చాతుర్మాస్యంలో ఆ యోగులు నీకు విజ్ఞానం ఉపదేసించాక నీకు మిగతా బాల్యం ఎలా గడిచింది? ఆ దాసీ జన్మలో ఎలా శరీరం విడిచిపెట్టావు (తనువుం బాసిన చందమెట్లు)? ఇప్పుడు ఆ పూర్వ జన్మ స్మృతి ఎలా కలిగింది? దీని సమాధానం వచ్చే వ్యాసంలో

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS